

ఆమె నవ్వుతోంది—

ఇదివరకటిలా అందంగానే వుంది—మనోహరంగానే వుంది. ఐనా ఎందుకో నాకు ఆమె నవ్వు పట్ల అసహ్యమే కలిగింది. ఇలా అసహ్యం కలగటానికి మంచి కారణమే వున్నది.

రెండు నెలల క్రితం వరకు ఆమె భర్త మోహనరావు బ్రతికే వున్నాడు. ఇప్పుడు ఆమె ఎదురుగా గాడ్రెజ్ కుర్చీలో కాలుమీద కాలు వేసుకుని కూర్చుని మాట్లాడుతున్న

ఆ అందమైన యువకుడు ఎవరో నాకు తెలీదు. బహుశా అతను ఆమె పనిచేసే ఆఫీసులో మరో ఉద్యోగి అయి వుండొచ్చును. ఐతే ఇంతకుముందు ఎన్నడూ అతను ఆ ఇంటికి రావటం నాకు తెలీదు. ఎటొచ్చీ ఓ ఇరవై రోజుల క్రితం వించే అతను ఆమెకోసం ఆ ఇంటికి వస్తున్నాడు.

కిటికీ దగ్గర కూర్చున్నాను. నా చేతిలో ఓ ఇంగ్లీషు నవల వున్నది.

వాళ్ళిద్దరూ మేడమీది గదిలో వాకిలి ఎదురుగానే కుర్చీల్లో కూర్చుని వున్నారు. ఒకవేళ వాళ్ళు నన్ను చూస్తే నవల చదువుతున్నానని, వాళ్ళని గమనించడం లేదని అనుకుంటారు.

చీకటి పడింది.

ఆ గదిలో దీపం వెలిగించింది ఆమె. నాకు లైటు వెయ్యాలని అనిపించలేదు. లైటు వేస్తే నేను వాళ్ళకు స్పష్టంగా అగుపడతాను.

ఆమె లేచి నిలబడింది నా దృష్టినించి వెళ్ళిపోయింది పక్కకు. అతను ప్యాంటు జేబులోవించి సిగరెట్ ప్యాకెట్ బయటకు తీసి ఓ సిగరెట్టు ముట్టించాడు. ఆ తర్వాత టేబుల్ మీదకు వొంగి, దానిమీద వున్న ఏదో మేగజైన్‌ను అందుకున్నాడు. అతన్నలా చూస్తుంటే నాలో ఓ విధమైన ఏవగింపు కలిగింది.

ఆమెకు భర్త లేడని, ఆమె సులభంగానే తన ఆకర్షణకు లోనవుతుందని గ్రహించి, తన ప్రయత్నాలు మొదలు పెట్టి వుంటాడు.

చూస్తున్నాను.

అతను సిగరెట్టు పొగను రింగులుగా వదులుతున్నాడు.

ఉన్నట్టుండి ఆమె ప్రత్యక్షమయింది. ఆమె చేతిలో రెండు పింగాణీ కప్పులు వున్నాయి. బహుశా అందులో కాఫీనో, హార్లిక్సో వుండొచ్చు.

అతను మొహమాట పడలేదు. తీసుకున్నాడు. ఆమె మళ్ళీ అతని ఎదురుగా కూర్చున్నది.

అతను తాగుతూ ఏదో అన్నాడు. ఆమె నవ్వింది.

నాకు చెప్పలేనంత అసహ్యం కలిగింది. అసలు ఆమె ఎలా నవ్వగలుగుతున్నది? ఈ ప్రశ్నే నన్ను వేధిస్తోంది.

నిజంగా నా అంచనాలన్నీ తారుమారు ఐనాయి. ఆమె భర్త మోహనరావు జీవించి వుండగా నేను జెలసీగా ఫీలయ్యాను వాళ్ళ అన్యోన్యత చూసి. నేనూ పెళ్ళి

చేసుకుంటే, నా భార్య నన్ను అంత గాఢంగా ప్రేమించగలదా అనిపించింది. ఒకవేళ ఆమె నన్ను ప్రేమించగలిగినా నేను నా భార్యకు అంత ప్రేమను అందించగలనా అని కూడా అనిపించింది.

మోహనరావు, ఆమె అంత గాఢంగా ప్రేమించుకున్నారు. పాలు-నీరులా కలిసిపోయారు. నా ఉద్దేశ్యం వాళ్ళిద్దరూ ప్రేమించి, పెళ్ళి చేసుకుని వుంటారు. అంతే అయివుంటుంది.

సరిగ్గా రెండు నెలల క్రితం మోహనరావుకు ఓ రాత్రివేళ ఉన్నట్టుండి ఏదో జబ్బు ముంచుకు వచ్చింది. అప్పటికప్పుడు ఆ ఇంటి యజమాని, ఆమె- అతన్ని హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళారు. ఆ మరు రోజున ఉదయమే నేను మోహన రావు హాస్పిటల్లోనే పోయాడని, అతన్ని టాక్సీలో వాళ్ళ వూరికి తీసుకువెళ్ళారని విన్నాను.

నిజంగా షాక్!

ఆమెను తల్చుకుంటేనే అంతు లేని జాలి కలిగింది.

ఇక ఆమె బ్రతుకు శూన్యమే! చీకటి! అసలు ఆమె ఈ షాక్‌ని తట్టుకుని బ్రతగ్గలదా?

ఇలాంటి ఎన్నో అనుమానాలు నన్ను ఆక్షణాల్లో చుట్టుముట్టాయి.

ఆ తర్వాత ఓ నెలరోజుల వరకు ఆ గదికి పెద్ద తాళం వేళ్ళాడుతూ కనిపించింది.

నెలరోజుల తర్వాత ఆమె తిరిగి ఆ గదిలోకి ఒంటరిగా ప్రవేశం చేసింది. ఆమె సన్నగా ఐపోయింది. ముఖంలో కళ కూడా తగ్గినట్లు అనిపించింది.

రోజూ ఆమెనే గమనిస్తున్నాను.

ఎంతలో ఎంత మార్పు! నుదుట బొట్టులేదు. చేతులకు గాజులు లేవు. ఆమె రూపం చూస్తే నా హృదయాన్ని ఎవరో కసిగా మెలి తిప్పినట్లయ్యింది.

కాని క్రమంగా ఆమెలో వచ్చిన మార్పును గమనించాను. ఆమె చేతికి గాజులు వేసుకున్నది. నుదుట చిన్న తిలకం బొట్టు పెట్టుకున్నది. ఆ అలంకరణకు తోడుగా రోజూ సాయంత్రవేళ ఆమె గదికి వచ్చి, నవ్వుతూ కబుర్లు చెబుతున్న ఆ యువకుడు, వాచీ చూసుకున్నాడు. లేచి నిలుచున్నాడు.

ఆమె కూడా నిలబడింది. ఇద్దరూ బయటకు వచ్చారు. అతను ఆమెతో ఏదో చెప్పి, మెట్లుదిగి వెళ్ళిపోయాడు. ఆశ్చర్యం ఏమిటంటే అతను రోజూ వచ్చి, రాత్రి ఎనిమిది గంటలు కూడా అవక

ముందే వెళ్ళిపోతున్నాడు. అతను ఎప్పుడయినా ఓ రాత్రి అక్కడ గడుపుతాడేమోనని నేను అనుకునే వాడిని.

ఆమె లోపలకు వెళ్ళి తలుపు లను మూసింది.

నేను లేచి నా గదిలో లైటు వేశాను. ఒక్కసారిగా నా ఆలో చనలు చెదిరిపోయాయి.

ఎనిమిది గంటలు కావస్తోంది.

ప్యాంటు షర్టు వేసుకుని, గదికి తాళం పెట్టి, కిందికి వచ్చాను రోడ్డుమీదికి.

వీధి దీపాలు వెలుగుతున్నాయి మసగ్గా. అంతగా జన సంచారం లేదు.

నేను భోజనం చేసే హోటలు అక్కడికి అంత దూరం కాదు. నడుస్తున్నాను గానీ, నా ఆలోచన లన్నీ ఆమె గురించి, భార్యాభర్తల సంబంధం గురించి.

మోహనరావు బ్రతికి ఉన్నప్పుడు తన భార్య తనపట్ల చూపుతున్న ప్రేమకు ఎంతో పొంగిపోయి వుంటాడు. సంతోషపడి వుంటాడు. తన భార్య దృష్టి పూర్తిగా తన మీదే వున్నదని, ఆమెకు మరో మగవాడి గురించిన ఆలోచనే లేదని, తను లేకపోతే ఆమె జీవి తాంతం తనకోసం ఒంటరిగానే వుండిపోతుందని, ఇంకా ఎన్నెన్నో అనుకుని వుంటాడు.

కాని జరుగుతున్నదేమిటి?

పూర్ మోహన్‌రావ్!

అతనిమీద నాకు ఎంతో జాలే సింది.

మోహనరావుతో జీవితాన్ని ముడి వేసుకుని అతనితో ఎన్నో సుఖాలను, మధురమైన అనుభూతు లను పొంది, తీరా అతను హఠా త్తుగా ఈలోకంనుంచి వెళ్ళిపోగానే రెండు నెలల కాలంలోనే అన్నీ మరచి, ఏమీ తెలియని దానిలా ఆమె ప్రవర్తించగలుగుతోంది.

దారుణం!

హోటల్లోకి నడిచాను. నిండుగా వున్నారు మనుషులు. ఐనా ఓ మూల ఖాళీ. వెళ్ళి కూర్చున్నాను.

యాంత్రికంగా భోజనం చేస్తు న్నాను.

రేపు నాకు పెళ్ళయి, పెళ్ళయిన ఏడాది తర్వాత నేను హఠాత్తుగా చనిపోతే, నా భార్యకూడా ఇలాగే ప్రవర్తిస్తుందా?

వద్దనుకున్నా ఈ ఆలోచన నా మనసులోకి పదే పదే వచ్చింది భోజనం చేస్తున్నంతసేపూ.

హోటల్లోనించి బయటకు వచ్చి పక్కనే వున్న కిల్లీషాపులో వక్క పొడి పొట్లం కొని వేసుకున్నాను.

ఆమెకు లోకం గురించయినా భయం లేదా?

మళ్ళీ ఆలోచనలు మొదలు....

ఆమె చదువుకుని వుండొచ్చు. ఉద్యోగం చేస్తూ వుండొచ్చు.... అంత మాత్రాన స్త్రీ సహజమైన కట్టుబాట్లను దాటిపోగలదా?

భర్త బ్రతికుండగా, ఆమె ఎలా ప్రవర్తించింది?

దాదాపు ఆరునెల్ల క్రితం వాళ్ళిద్దరూ నేను వుండే గదికి ఎదురుగా వున్న మేడమీద గది లోకి వచ్చారు.

మొదటిసారి చూడటంతోనే ఆమె నన్ను ఎంతగానో ఆకర్షించింది. అందం—దాన్ని మించిన ఆకర్షణ.

మోహనరావు కూడా అందంగానే వుండేవాడు. ఇద్దరూ వేర్వేరు ఆఫీసుల్లో ఉద్యోగం చేసేవాళ్ళు. ఉదయం తొమ్మిది గంటలయ్యేసరికి ఇద్దరూ భోజనం చేసేవాళ్ళు. తర్వాత తొమ్మిదిన్నర అయ్యేసరికి టిఫిన్‌బాక్స్‌లతో ఆఫీసులకు బయలేదేవాళ్ళు. సాయంత్రం ఇద్దరూ కలిసే ఇంటికి వచ్చేవాళ్ళు. ఆ తర్వాత దాదాపుగా రోజూ సినిమాకో, షికారుకో వెళ్ళేవాళ్ళు.

ఎప్పుడు బయటకు వెళ్ళినా, ఇద్దరూ జంటగానే....ఎప్పుడూ నవ్వుతూ, హుషారుగా ఈ లోకాన్ని మరిచిపోయినట్టుగా ప్రవర్తించేవాళ్ళు.

ఒకసారి మోహనరావుకు జ్వరం వచ్చింది. నాలుగు రోజులు అతను ఇంట్లోనుంచి బయటకు రాలేదు ఆ నాలుగురోజులూ ఆమె కూడా ఆఫీసుకు వెళ్ళలేదు. సెలవు పెట్టి అతని దగ్గరే కూర్చుండిపోయింది. ఆ నాలుగురోజులూ ఆమె సరిగ్గా తల దువ్వుకోలేదు. అసలు అలంకరించుకోలేదు. అతనికి జ్వరం తగ్గిన తర్వాత ఆమె మామూలు మనిషి అయ్యింది.

నాలుగు రోజులు భర్తకు జ్వరం వస్తేనే తల్లడిల్లి విషాదంలో మునిగిపోయిన ఆమె, ఆ భర్త పూర్తిగా ఈ ప్రపంచాన్ని వదిలిపోయిన తర్వాత హాయిగా నవ్వుతూ బ్రతకగలుగుతోంది. ఏమిటీ మనిషి?

ఆ రాత్రి చాలా సేపటివరకూ నేను ఆమె గురించే ఆలోచిస్తూ నిద్రకు దూరమయ్యేను. తర్వాత ఎప్పటికో నిద్రలోకి జారుకున్నాను.

* * *

ఎవరో తలుపుమీద చప్పుడు చేస్తున్నారు.

మెలుకువ వచ్చింది. కిటికీలో నుంచి వెలుతురు లోపలకు పడు తున్నది.

ఎనిమిది గంటలు వస్తోంది. రాత్రి పొద్దుపోయిన తర్వాత నిద్ర పోవటంవల్ల తెల్లవారగానే మెల కువ రాలేదు.

లేచి తలుపులు తెరిచాను.

ఇంటివాళ్ళ అబ్బాయి చంద్రం. అతను ఏదో చెబుతున్నాడు. కాని అప్పటికే నా దృష్టి ఎదురుగా మేడ మీది గదిమీదికి వెళ్ళింది. తలుపులు తెరిచి వున్నాయి. అక్కడంతా మనుషులే!

వాళ్ళంతా ఎందుకు అక్కడ వున్నారు?

"ఆమె నిద్రమాత్రలు మింగి చనిపోయిందట రాత్రి. చూసి వద్దాం రండి!" చంద్రం చెబు తున్నాడు.

షాక్! ఒక్క క్షణం నాకేమీ అర్థం కాలేదు. ఏమిటి—ఆమె ఆత్మహత్య చేసుకున్నదా?

షర్టు వేసుకుని అతనితో అక్కడకు వెళ్ళాను. జనాన్ని నెట్టుకుంటూ లోపలకు వెళ్ళాను. బెడ్‌మీద బోర్లా పడివున్నది ఆమె. క్రింద టిక్‌ట్వంటీ సీసా.

టేబుల్‌మీది ఫ్లవర్‌వాజ్ క్రింద నించి తొంగి చూస్తున్న కాయితం. నా దృష్టిని అక్షరాల మీదకు మళ్ళించాను.

"ఆయన ఆఖరికోరిక- నేను విషాదాన్ని మరచి నవ్వుతూ బతకా లని ఆయన కోరిక తీర్చాలనే అనుకున్నాను. నవ్వటం మొదలు పెట్టాను. కాని నా నవ్వు, నా ప్రవర్తన అంతా నటనేనని నా అంతరంగానికి తెలుసు. నన్ను తన ప్రాణంకంటే ఎక్కువగా ప్రేమించి ఎన్నో సుఖాలను, మధురమైన అనుభూతులను ఇచ్చిన ఆ మనిషిని ఎలా మరచిపోగలను? మరచిపోయి ఆయనకు అన్యాయం చెయ్యలేను. అందుకే నేనూ ఆయన దగ్గరకే ప్రయాణం చేస్తున్నాను.

—కల్యాణి."

ఈసారి నామీద నాకే అస హ్యం కలిగింది. నా అంచనా తలక్రిందులయింది. ఆమె అంత రంగం తెలీకుండా ఆమెను ద్వేషించాను.

ఆమె నవ్వు- నా కళ్ళముందు కదులుతోంది.

ఆమె నవ్వు- నిర్మలమైనది. ఆమె మనసు నిర్మలమైనది కాని. తెలుసుకోలేకపోయాను.

'అగాధమైనది-స్త్రీ హృదయం. అది ఎంతయినా నిజం. •